# వెన్నెల దీపం

కావేరి-సావేరి



శ్రీనివాసులు నారాకతో యెగిరి గంతు వేశాడు ఆనందంతో. 'నీవు రావేమో అనుకున్నాను' అన్నాడు.

'ఏం' అన్నాను.

'పట్టణంలో వుండేవాడివి రైలు ప్రయాణం, బస్సు ప్రయాణం, బోటు ప్రయాణం, చివరకు నడక కూడా నీవు చేయలేవేమోనని, అందుకే నీవు వచ్చేవరకు నాకు నమ్మకంలేదు. ఎలా అయితేనేం వచ్చావు' అన్నాడు నవ్వుతూ,

నిజమే, ఆ గ్రామం చేరటానికి ఆ అవస్థలన్నీ పడాల్సిందే తప్పదు 'ఇంతకీ యెన్ని రోజులు శలవు పెట్టావు?' అన్నాడు శ్రీనివాసులు.

'నీ ప్రాణం తీయటానికి వారం రోజులు యిక్కడే వుంటాను.' అన్నాను నవ్వుతూ.

అయితే ఫరవాలేదు. మళ్లీ మన పాత రోజులు ఒకసారి తిరగవేసుకోవచ్చు.'

'శలవు పెట్టలేదు. ఉద్యోగరీత్యా వచ్చాను, కావాలని ప్రత్యేకంగా నీ కోసం.'

'మొత్తంమీద చాలా గట్టివాడవే. లే స్నానం చేసి భోజనం చేద్దువుగాని' అన్నాడు ఆ గ్రామానికి పోష్టు మాష్టరు, నా కాలేజీ మిత్రుడు అయిన శ్రీనివాసులు. వేడి నీళ్ళు స్నానంచేసి భోజనాలు కానిచ్చి వెన్నెల్లో మంచంమీద పడుకున్నాము యిద్దరం!

'నాయుడుగార్ని యెప్పుడు కల్సుకుంటే బావుంటుంది?' అని అడిగాను, నేను వచ్చిన పనిలో సగం పూర్తి చేయటానికి.

'అబ్బ! అవన్నీ రేపు మాటాడుకుందాంలేరా! చక్కగా యేమయిన కబుర్లు చెప్పు! స్వర్గానికి పోయినా. అన్నట్టుగా ఆచెందుకు మధ్య!' అన్నాడు కొంచెం నిసుగ్గా. శ్రీనివాసులు రాత్రి పన్నెండుగంటల వరకు మా కాలేజీ ముచ్చట్లతోనే సరిపోయింది. ఆ తరువాత నాకెప్పుడు నిద్దర పట్టిందోగాని తెల్లారి ఎనిమిదింటికి మెలుకువ వచ్చింది. నేను వచ్చానని శ్రీనివాసులు కబురు చేసాడులావుంది నేను స్నానం చేసి వచ్చేసరికి హాల్లో నాయుడుగారు కూచుని వున్నారు నన్ను చాలా ఆదరంగా చూస్తూ తన యింట్లోనే బస యేర్పాటు చేసానని చెప్పి నన్ను బలవంతం చేశారు. కానీ నేనే వద్దన్నాను. శ్రీను కూడ నాయుడుగార్ని బలవంతపెట్టనీలేదు. ఆ రోజునుంచే మా పిక్చరును ప్రదర్శిస్తామని నాయుడుగారు అనగానే బాక్సును వారికి నేను అందజేశాను.

సాయంకాలం శ్రీను నేను హాలుదగ్గరకు వెళ్ళాము. అది హాలు అని శ్రీను చెప్పే వరకు నేను నమ్మలేకపోయాను. ఊరికి రెండుఫర్లాంగులదూరంలో రెండు గ్రామాలకు మధ్యగావుంది. నాలుగుప్రక్కలా తడికెలు, మానవులే కాక పైనుంచి దేవతలు కూడా చూడటానికి వీలుగా హాలు కప్పు చిరిగిపోయిన తడికెలతో కప్పబడివుంది. దాన్ని ఆనుకునే ఒక కిళ్లీ బడ్డీలాంటి దాన్ని చూపించి కాబిన్ రూం అన్నాడు నాయుడు. లోపల ప్రొజెక్టర్‌వుంది కాబట్టి కాబిన్ రూం అని నేను నమ్మవలసివచ్చింది. ఇంక తెర సంగతి చెప్పనవసరంలేదు. అది మాత్రం దీర్ఘ చతురస్రాకారంలోనే వుంది. కానీ, శ్రీకృష్ణుడు తన పొట్టలో పద్నాలుగు లోకాలను దాచుకున్నట్టుగా. ఆ తెర తనలో చతుర్భుజం, పంచభుజి మొదలగు హైస్కూలు జామెట్రీ బొమ్మలన్నిటిని ముద్రించుకు

ఒక్కొక్కటి చొప్పున దాచుకుంది. ఆట ప్రారంభం అయింది ఎనిమిదింటికి. తెరమీద బొమ్మలు చూస్తూవుంటే యీ పిక్చరు నేను తీసుకువచ్చినదేనా అనే అనుమానం నాకు కలిగింది. గాలికి తెర అటు యిటు వూగుతూవుంటే సత్యభామ నరకాసురునితో యుద్ధం చేస్తున్నట్టుగా లేదు, సరసాలాడుతున్నట్టుగా వుంది ఆ సినిమాహాలు. అమాయకులగు ప్రేక్షకులు చూస్తూంటే నాకు యెంతో ఆశ్చర్యంగా వుంది నాకు తెలీకుండానే ఆరురోజులు గడిచిపోయాయి శ్రీనుతో హాయిగా కాలక్షేపం చేశాను. ఆ చివరరోజు రాత్రి నాయుడుగారు హాలుదగ్గర తన సినిమా వ్యాపారం గూర్చి గంటసేపు బోరుకొట్టారు. నేను తాపీగా వింటూ జేబులోంచి సిగరెట్టు తీసి కొత్తగా వచ్చిన చిన్న అగ్గిపెట్టెతో వెలిగించి ఒక్క దమ్ము లాగాను.

'అదేంటండోయ్! ఈ అగ్గిపెట్టె చాలా చిన్నదిగా వుంది?' నాయుడు ప్రక్కనున్న మరొక ఆసామి ఆశ్చర్యంగా నా చేతిలోని అగ్గిపెట్టెవైపు చూస్తూ అన్నాడు

'నేను నవ్వుతూ' యిది చాలా సింపుల్‌గా జేబులో పెట్టుకోవటానికి వీలుగావుంటుంది.' అన్నాను, వారి ఆశ్చర్యానికి ఆనందిస్తూ.

'యిలాంటివి యిక్కడ అసలు దొరకవు దొరికినా అగ్గిపెట్టెలు కొనటం చాలా తక్కువ' అన్నారు నాయుడుగారు. ఆయన కలెక్షను లెక్కచూసుకుని యింటికి వెళ్లిపోయాడు. నేను పన్నెండువరకు హాలు దగ్గరనే కూచుని యింటికి బయలుదేరాను. పున్నమినాటి వెన్నెల, చేతిలో సిగరెట్టు మనస్సుకు హుషారుగా వుండి తొందరగా అడుగులు వేస్తున్నాను.

'ఏమండీ!' అని యెవరో పిలుస్తూన్నట్టుగా వుంటే వెనక్కు తిరిగాను. ఎవరూ కనబడకపోవటంతో మళ్లీ నడక సాగించాను. ఈసారి దగ్గరగా వినిపించింది. ఆగి పరిసరాలు పరికించాను. చుట్టూ పొలాలు. అరఫర్లాంగుదూరంలో ఒక పూరి పాక. ఆ పాకా ముందు యెవరో కదులుతున్నట్టుగా వుంటే బహుశా యెవరో రైతు అయివుంటాడని అటువైపు దారి తీశాను. చేతిలో సిగరెట్టు ప్రేళ్లకు వెచ్చదనాన్నిస్తూవుంది. ఆ యింటిముందు నిలుచున్నాను.

'దీపం ఆరిపోయింది కాస్త వెలిగించరూ!' యెంతో ప్రార్థనాపూర్వకంగా మృదువుగా వినిపించింది ఒక స్త్రీ కంఠం! మల్లెపూలలాంటి తెల్లని చీర నల్లని జాకెట్టు పాలరాతి మెరపులాంటి శరీరం యింటి కప్పులోంచి పడుతున్న వెన్నెలలో ఆమె కనిపిస్తూవుంది వయస్సు పాతిక వుండవచ్చు. మొహం మాత్రం సరిగ్గా కనిపించటం లేదు

నేను మాటాడకుండా పాకెట్‌లోంచి అగ్గిపెట్టెతీసి ఒకపుల్ల వెలిగించాను. రివ్వున ఒక గాలి తెరవచ్చి మండేపుల్లను విసిరి కొట్టింది. మరొక పుల్ల తీసి నా రెండు చేతులను గూడుగా అమర్చాను గాలికి ఆరిపోకుండా! కానీ యెక్కడనుండివచ్చిందోగాని పెద్ద సుడిగాలి పెద్ద ఝుంకారంతో వచ్చింది, చేతిలో పుల్ల ఆరిపోయింది. అలానే మరి కొన్ని పుల్లలు వృధా అయిపోయాయి. నాకు విసుగు పుట్టింది. కానీ దీపం వెలిగితే ఆమె ముఖాన్ని పరిశీలించటానికి అవకాశం వుంటుందని మరికొన్ని పుల్లలను వృధా చేశాను

'గాలి వేస్తున్నట్టుగా వుంది లోపలకు వచ్చి వెలిగించండి!' ఆమె యీసారి యింకా మృదువుగా సన్నగా అంది. నేను పంచలోనికి అడుగుపెట్టి మరికొన్ని పుల్లలు వెలిగించాను నా ఓపికను పరీక్షిస్తున్నట్టుగా అవికూడా ఆరిపోయాయి. నా చేతిలోని సిగరెట్టు మాత్రం ప్రేళ్లను చురుక్కుమనిపించింది. ఆమె గలగల నవ్వుతూవుంది నా అసమర్థతను వెక్కిరించినట్టుగా. నేను కుంచించుకుపోయాను.

'మీరు రోజుకు యెన్ని సిగరెట్లు కాలుస్తూంటారు?'

ఆమె అడిగిన యీ వింత ప్రశ్నకు ఆశ్చర్యపోయి 'రెండు పెట్టెలు' అన్నాను.

ఆమె యింకా అందంగా నవ్వుతూ అంది. 'అయితే సిగరెట్టుకు యెన్ని పుల్లలు వెలిగిస్తారు?'

ఒక స్త్రీ నన్ను సవాలు చేస్తున్నట్టుగా అడుగుతూవుంటె నాకేకాదు యెవరికయినా పౌరుషం వస్తుంది. ఆమె యెత్తిపొడుపులకు నాకూ బాధ అనిపించటంలేదు. ఇంకా మాటాడితే బావుణ్ను అనిపించింది పైగా. అప్పటికే నా అగ్గిపెట్టెలో పుల్లలు రెండు మాత్రమే మిగిలాయి.

'ఈ గాలి చూడగా జగాన్నే చీకటిగా చేసేటట్టుగా వుంది. ఇప్పుడు వెలిగించండి.' అంటూ ఆమె ముందుకు వచ్చి తన పైట చెరగును నా మొహంమీదనుంచి జారేటట్టుగా విసురుతూ నా చేతులకు అడ్డం పెట్టింది. ఆమె చొరవకు నా శరీరంలో నెత్తురు ఆవేశంగా పొంగసాగింది. 'ఎవరీమె? ఎందుకిక్కడ ఒంటరిగా, యీ పాడు గుడిశెలో వుంది? ఈమె ప్రవర్తనకు అర్థంయేమిటి?' అని ఆలోచనలో పడ్డాను. ఒక పుల్లను చాలా జాగ్రత్తగా వెలిగించి చప్పున నా చేతులు గూడుగా అమర్చి సగం పుల్ల మండేవరకు పట్టుకుని చేతులు విప్పాను. ఆమె ఫక్కున నవ్వింది. ఆమె ముఖం నా చేతులకు దగ్గరగా వుంటంవల్ల ఆ మండే పుల్ల కాస్తా ఆరిపోయింది. నాకు విపరీతంగా కోపం వచ్చింది. ఆమె యింకా నవ్వుతూనేవుంది.

'ఎందుకలా నవ్వుతావు?' ఆమె నవ్వుతున్నందుకు నాకు కోపంలేదుగాని, ఆమె ముఖం యీసారి అయినా చూడటానికి అవకాశం కలగలేదనే విసుగువల్ల కోపంగా అన్నాను.

'మీకు కోపం వచ్చినట్టువుందే! పోనీ లెండి! దీపం లేకపోతే జగత్తు అంతటికీ 'వెన్నెలదీపం' వుందిగా! అంది నా కోపాన్ని గ్రహించి.

'ఎవరు నువ్వు? ఒంటరిగా యిక్కడ ఎందుకుంటున్నావు?' నిశితంగా చూస్తూ అడిగాను. ఆమె నవ్వటం ఆపుచేసి 'ఈ ప్రశ్న మీరు అడుగుతారని నాకు తెలుసు. అయినా నా కథ తెలుసుకోవాలని వుందా? నా జీవితం చాలా విచిత్రమయినది. రేపు యీ వూరిలో యెవర్ని అడిగినా చెపుతారు.' అంది.

'పోనీ పేరేమిటో తెలుసుకోవచ్చా?' అన్నాను.

'నాకు తెలీదు. ఈ వూరిలో నన్ను యేమని పిలుస్తారో కూడా నాకు తెలీదు. ఈ వూరివాళ్లను ఒకటి రెండుసార్లు తప్ప, యెక్కువసార్లు చూడలేదు. వారి గురించి నాకు తెలీకపోయినా నా గురించి వారికి పూర్తిగా తెలుసు'

ఆమె సమాధానాలతో ఆలోచనలో పడ్డాను.

'మీరు' యింతసేపూ నిలుచునేవున్నారు.

Don't Miss
**LATEST SEX BOOKS**
Rs. 6/50 Each
Sex Atlas 325 illustration • Increase your sexual efficiency • Answer to confidential sex question • Complete course of Modern ballroom dancing • Increase your height upto 6" • How I became pross • Sex weakness after 40 • No I am not ashamed • Sexually cold wife & her causes • Wedding nights • Sex diseases and treatment • Sex knowledge • Her night experience • Art of Kissings • How men tempt women • Happy honeymoon • Hidden side of sexual science • Kamsutra (illustrated)
GEMINI BOOKS (10)
P BOX 1607, DELHI-6

**1967-68 లో మీ అదృష్టము**
మీరు ఒక పోస్టు కార్డుపై దగు పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండు నెలలో జరుగు ముఖ్య సంఘటనల అనగా వ్యాపారంలో లాభ నష్టాలు, నరీమలో ప్రమోషన్ ట్రాన్సు ఫర్లు, సంతాన జననం, వివాహముల సంతోషాల

మరియు చెడు పుష్ఫల లక్ష శాంతి చేసుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజీఅదనం కడపనే చు చిన తృప్తి చెందగలరు.
PT DEV DUTI SHASTRI
Raj Jyotshi, (WAP) P B 86,
JULLUNDUR CITY

ప్రత్యేక చికిత్స
Licenced under M. & T. P.
Act — Rule (83)
వీర్యస్తంభనము .- నరాల బలహీనత పో మంచిశక్తి కల్గుటకు పైకి మరనకు తైలం 1 సీసా రూ 27/-. పైకం ముందుగా పంపాలి.
**డా. రత్నం సన్స్, (Estd 1904)**
అజంపురా రైల్వే వంతెన వద్ద,
New Malakpet,
హైదరాబాద్ — 36 ఆం ప్ర.

# వెన్నెలదీపం

లోపలకు రండి!' అంటూ ఆమె తలుపు దాటి లోపలకు నడిచింది. ఆమెను వెంబడిస్తున్న నాకు తలుపు నా తలకు తగలటంతో 'అబ్బా' అంటూ వెనక్కు పడబోయాను. ఆమె గలగల నవ్వుతూ వచ్చి నన్ను పట్టుకుని 'క్షమించండి దీపంలేదు' అంది. నేను బాధపడుతూవుంటే కనీసం జాలి అయినా చూపకుండా సెలయేరులా నవ్వుతూవుంటే నాలో రేగిన కోపం బాధ యెగిరిపోయాయి. ఆమె శరీరస్పర్శకు నా శరీరం జలదరించసాగింది ఆమె తలుపు తెరవగానే లోపలకు నడిచాను. ఆమె చూపిన మంచంమీద కూచుని చుట్టూ పరికించసాగాను. చుట్టూ మట్టిగోడలు ఇంటికప్పు పైభాగం తాటాకులు లేకపోవటంలో లోనికి వెన్నెల పడుతూవుంది ఆమె మొహం మీద వెన్నెలపడితే పరిశీలించుదామనివుంది. కాని నా ప్రయత్నం ఆమె కనిపెట్టినట్టుగా ఆమె నీడలో కూచుంది. ఇలాంటి శిధిలావస్థలో వున్న యీ యింటిలో ఆమె ఒంటరిగా యెలా యెందుకు వుంటుందో నాకు భయం ఆశ్చర్యం కలుగసాగాయి.

'నాకో సహాయం చేయగలరా?' అంది ఆమె.

'ఏమిటో చెప్పండి! నావల్ల జరిగేదయితే చేస్తాను.' అన్నాను ఆమె యేమి కోరుతుందా అని. 'నాకు మద్రాసువెళ్ళి అక్కడ సినీమాలలో నటించాలనివుంది. అందుకు మీరు సహాయం చేయండి' అంది

ఆమె కోర్కె నాకు ఆశ్చర్యం కలిగించలేదు. సహజంగా చాలామంది అమ్మాయిలు నన్ను అలా అడగటం నా వృత్తిరీత్యా అనుభవమే! కాని ఆ పరిశ్రమ అంత మంచిది కాకపోవటంవలన చూస్తూ చూస్తూ అమాయికులయిన అమ్మాయిలు అందులో నాశనమవటం నా కిష్టంలేదు.

'ఆ పరిశ్రమ అంత మంచిదిగాదు. నీవు అందులో ప్రవేశించటం నాకు యేమాత్రం యిష్టంలేదు. నీకు మరోసహాయం కావాలంటే చేయగలను' అన్నాను.

కాని ఆమెకు నా సమాధానం రుచించలేదు. 'మీరు నే నడిగిన సహాయం చేయగలిగితే చేయండి. మిగతా విషయాలు అనవసరం. మీరీ సహాయం తప్పక చేయగలరని ఆశించాను. ఇది కూడా తీరేలా లేదు. నా జీవితం యెప్పుడూ అంతే అందుతుందనుకున్న ఆశాఫలం అందకుండానే పోతూవుంది. అది నా దురదృష్టం!' ఆమె అంత నిరాశలోను కూడా లేత చిగుళ్ళ కదలికలా నవ్వసాగింది సన్నగా!

ఆమె అంతగా అడుగుతూంటే నా సమర్థతను యెందుకు దాచుకోవాలానిపించింది. 'మీకు అంతగా వెళ్ళాలని వుంటే మీక్కావలసిన సహాయం చేస్తాను మద్రాసులో నాకు తెలిసిన నిర్మాత వున్నాడు. అతనికి వుత్తరం వ్రాసి యిస్తాను. తీసుకు వెళ్ళండి' అన్నాను.

ఆమె 'నిజంగానా...' అంటూ నవ్వసాగింది ఆమెకు నవ్వటం తప్ప యేం తెలీనట్టు వుంది ఆనందంలో అదే నవ్వు... కోపంలో అదే నవ్వు...ఆశలో అదే నవ్వు... నిరాశలో అదే నవ్వు. ఇంత విచిత్రమైన మనిషిని నే నెన్నడూ యెక్కడా చూడలేదు. జేబులో పెన్ను కాగితం తీశాను.

'అక్కడ చీకటిగా వుంది. ఇక్కడకు రండి వెన్నెల దీపం వుంది.' అందామె.

నేను మాటాడకుండా పైనుంచి పడుతున్న వెన్నెల వెలుగు క్రింద కూచుని 'మీ పేరు చెప్పండి?' అన్నాను వుత్తరం వ్రాయటానికి వుపక్రమిస్తూ.

'నా పేరు అంత ముఖ్యమా?' ఆయితే మీ యిష్టం వచ్చిన పేరు పెట్టండి?' అంది.

ఇంక లాభంలేదని వుత్తరం పూర్తిచేసి ఆమెకు ఇచ్చాను.

'మీ ఫోటో ఒకటి యివ్వండి! నాకు మీ గుర్తుగాను వుంటుంది, మీ మిత్రునికి చూపించటానికి వుంటుంది.' అంది. నేను కాస్సేపు తటపటాయించి చివరకు యిచ్చాను. కనీసం నాకు కృతజ్ఞత అయిన చెప్పకుండా వుత్తరం, ఫోటో దగ్గరలోవున్న ఒక కొయ్యపెట్టిలోవుంచి నా దగ్గరకు వచ్చింది. 'మీరు చేసినదానికి ప్రతిఫలంగా యివి మీ దగ్గర వుంచండి.' అంటూ ఐదువందరూపాయల నోట్లు నా కివ్వబోయిందామె.

'అదేమిటి సహాయానికి ప్రతిఫలం ఎందుకు? ప్రతిఫలం యిస్తే అది సహాయం అనిపించుకోదు' అన్నాను తెల్లబోతూ!

'మద్రాసులో నా అదృష్టం బావుండి వెళ్ళినాని అవుతే అది నిజమయిన సహా

యం అనిపించుకుంటుంది. కాకపోతే మీ వృథా శ్రమ అవుతుంది. మీ శ్రమకు ప్రతిఫలంగా వుంచుకోండి! నా అదృష్టం బాగా వుండి అవకాశంవస్తే మీ మిత్రుని పేర యీ డబ్బు నాకు పంపండి' అంది.

మాటాడకుండా అవి అందుకున్నాను. ఇంతవరకు నా ముందే నిలుచుంది. ఆమె ముఖాన్ని పరిశీలించకపోయినందుకు నాకు అసంతృప్తిగానే వుంది సిగరెట్టు తీసినోట్లో వుంచి చివరకు మిగిలిన అగ్గిపుల్లను తీసి వెలిగించాను భగ్గుమని మండింది. నేను సిగరెట్టు ముట్టిస్తున్నట్టుగా నటిస్తూ మండేపుల్లను ఆమె మొహం దగ్గర పెట్టాను. ఆమె గప్పున నోటితో ఆర్పేసి నవ్వ సాగింది, నా ప్రయత్నాన్ని కోర్కెను కనిపెట్టి. ఒక్కరున కోపం వచ్చింది నాకు. ఈసారి ఆమె నవ్వుతూ వుంటే నాకు భయం వేయసాగింది. ఆ నవ్వు యింతకు ముందులా లేదు. చుట్టూ వెన్నెలవాన.. మధ్యన జుట్టును విరబోసుకున్న మర్రిచెట్టులా పూరిల్లు...మర్రిచెట్టుపై కూచున్న దేవతలా యీమె... పగిలిన గోడలు...శిథిలావస్థలో వున్న పాక... ఎందుకో నాకు భయం వేయసాగింది. వెళదామని లేచి నిలుచున్నాను.

'వెళుతున్నారా అప్పుడే?' అంది.

'రేపు కలుసుకుంటాను.'

'రేపు మీకు కనిపించను. ఈ రాత్రితో యీ ప్రదేశానికే స్వస్తి చెప్పబోతున్నాను.'


# వెన్నెలదీపం

'అయితే మద్రాసువచ్చి కలుసుకుంటాను' అంటూ అక్కడనుండి బయలుదేరాను. ఇంటికి వచ్చి పరుపుమీద వాలిపోయాను ఆమె ఆలోచనతో నాకు నిద్రరావటంలేదు ఆమె యిచ్చిన ఐదువందలరూపాయలు నాకు మనశ్శాంతిని కలిగించటంలేదు. నేను వెంటనే ఒక కవరులో పెట్టి వుంచాను నా మిత్రునికి పంపటానికి. ఆమె చరిత్ర యేమిటో శ్రీనివాసులుద్వారా సేకరించాలనుకున్నాను. టైము చూస్తే అప్పుడే ఒంటిగంట అయింది. శ్రీను అక్కడకు వచ్చాడు సిగరెట్టు వెలిగించుకోవటానికి కాసేపు అవి యివీ మాటాడుకున్నాము. అంతలోకే నాయుడుగారు అక్కడకువచ్చి నా బాక్సులు నాకు అందించి కంట్రాక్టు ప్రకారం డబ్బు గూడా యిచ్చేసి వెళ్లిపోయారు. నేను వుదయం నిద్రలేచేసరికి గదిబయట కోలాహలంగా వుంది. నాయుడుగారి హాలు రాత్రి తగలబడిపోయిందట. శ్రీనివాసులు చెప్పాడు. 'రాత్రి రెండవ ఆట కాగానే హాలుకు నిప్పు యెవరో ఒకామె అంటించిందట.'

'ఆమె యెవరో తెలీదా' అడిగాను.

'చాలామంది వెంబడించారుట, కానీ ఆమె దొరకలేదట. నాయుడు అంటాడూ అదంతా మంజుల చేసినపనే అంటున్నాడు.'

'ఆమె యెవరు?' కుతూహలంగా అడిగాను.




'అదొక పెద్ద గాథలే! నాయుడు యీ హాలు కట్టించి పదేళ్ళయింది. బాగానే సంపాదించాడు. ఒక సినిమా కూడా తీద్దామనుకున్నాడు. ఒకసారి పట్నం వెళ్ళి తన సినిమాలో ఛాన్సు యిస్తానని చెప్పి ఒక అమ్మాయిని తీసుకువచ్చాడు. అంతలో నాయుడుకు పంటల్లో నష్టం రావటంవల్ల సినిమా ప్రయత్నం మానుకున్నాడు. కానీ ఆమెను విడిచిపెట్టలేదు ఆమె నిజం గ్రహించి తనను యింటిదగ్గర దిగవిడిచిపెట్టమని లేదా సినిమాలో చేర్చమని బతిమిలాడుకుంది. కానీ అతను ఆమెను విడిచిపెట్టక యెటూ పోకుండా కట్టుదిట్టం చేశాడు. ఆమె తను సినిమాలో నటించాలనే కోర్కెతో తన తల్లిదండ్రులను ఎదిరించి వచ్చింది. కానీ అది నెరవేరలేదు. పైగా తన శీలం అతనివల్ల కలుషితం అయిపోయింది అంతే! ఆ మరునాడే వురిపోసుకుని చనిపోయింది.' శ్రీనివాసులు ఆగాడు

అతను చెప్పిన గాథ నాకు చాలా బాధ కలిగించింది. నాయుడు నా కలా కనిపించలేదు. మానవుల్లో అలాంటి వ్యక్తిత్వం భగవంతుడు యెందుకు సృష్టించాడనిపించింది నాకు.

శ్రీనివాసులు మళ్ళీ ప్రారంభించాడు. 'ఆమె అసలు పేరు మంగ! నాయుడే 'మంజుల' అని మార్చాడు. హాలుకు పూరికీ మధ్య పాడుపడిన పూరి పాక వుంది చూశావా అదే ఆమె యిల్లు!'

శ్రీనివాసులు చెపుతూంటే నేను నిర్ఘాంతపోయాను. 'పూరవతల పూరిల్లేనా' అరిచానేమో గట్టిగా.

'ఆఁ అదేనోయ్! ఏదీ అగ్గిపెట్టె యిలా తే సిగరెట్టు ముట్టించాలి.' అన్నాడు.

'లేదు. పెట్టె అయిపోయింది.' అన్నాను రాత్రి సంఘటన గుర్తుకు తెచ్చుకుంటూ.

'అరె! అప్పుడే యెలా అయిపోయిందోయ్! రాత్రేగా కొత్త పెట్టె తీశావు. కొంపదీసి నీవు రాత్రి ఆ పూరింటిలోకి వెళ్ళలేదుగదా!' అన్నాడు నన్ను అనుమానంగా చూస్తూ.

'వెళ్ళాను ఆమె నన్ను పిలిచింది.' శ్రీను గాభరాగా కుర్చీలోంచి లేచాడు. 'నేను అనుకున్నదంతా అయిందన్న మాట! ఆ

విషయం నీకు చెప్పుదామనుకున్నాను అయితే దీనం వెలిగించమన్న దన్నమాట!'

'అవును.'

'పుల్లలన్నీ వెలిగించావు గదూ! అన్నీ ఆరిపోయాయి గదూ!'

'అవు నవును.' ఆశ్చర్యంగా అన్నాను.

'వెంట నే తిరిగి వచ్చేసి వుంటావు.'

'లేదు! చాలా సేపు మాటాడాను.' ఈసారి శ్రీను ఆశ్చర్యపోయాడు రాత్రి జరిగిందంతా చెప్పాను. లతను నమ్మనట్టుగా నా వేపు చూశాడు. 'నిజం శ్రీనూ! ఆమె నిజంగా చనిపోయి వుంటే నే నిచ్చిన వుత్తరం, ఫోటో అక్కడే వుంటాయి వెళదాం పద!' అంటూ యిద్దరం వరు గెత్తాము. ఆ యింటిని చూసి మేం నిర్ఘాంతపోయాము. అది పూర్తిగా కాలి పోయి వుంది రాత్రి హాలు తగలబడినపుడే అది కూడా తగలబడిపోయిందట, అక్కడెవరో చెప్పారు. తలుపులు సగం కాలి వున్నాయి. ఇద్దరం లోపలకు అడుగు పెట్టాము. ఎదురుగా కొయ్యపెట్టె! నే నిచ్చిన వుత్తరం ఫోటో అందులోనే ఆమె వుంచింది కానీ ఆశ్చర్యం యేమిటంటే ఆ పెట్టె కూడా పూర్తిగా కాలిపోయివుంది ఆ కాలిన బొగ్గులను నెట్టాను. నిర్ఘాంత పోయాను ఆ బొగ్గుల మధ్య నా వుత్తరం, ఫోటో వున్నాయి నేను అర్థం కాక శ్రీనుసు చూశాను. శ్రీను నా వైపు చూస్తూ అన్నాడు. 'చూడు మిత్రమా! రాత్రి నీకు జరిగిన సంఘటనలు లాంటివి యీ గ్రామంలో చాలామందికి జరిగాయి. ఆమె సినిమా పిచ్చిలో చనిపోయింది గాబట్టి నిన్ను సినిమాలో చేర్పించమని అడిగి వుంటుంది' శ్రీను అంటుంటే ఆశ్చర్యంగా వుంది. రాత్రి ఆమె యిచ్చిన నోట్లు గుర్తుకు వచ్చి పర్సులో వున్న కవరు తెరిచాను. ఆశ్చర్యం! అవి లేవు'

నా చర్యలకు శ్రీనివాసులు పక పక నవ్వసాగాడు. 'మిత్రమా! నీకు ఆశ్చర్యం కలిగించేది మరొక విషయం! అటు చూడు!' అన్నాడు. అటు చూశాను. మందు వున్న అగ్గిపుల్లలు' నన్ను వెక్కిరించాయి. ●







మధు ఎలెక్ట్రానిక్స్ (ఇండియా)
67-D, (A.S P.), కమలా నగర్. ఢిల్లీ-7

ప్రతినిధులు లేని ప్రాంతములందు డీలర్లు కావలెను ఇంగ్లీషులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు వ్రాయవలెను. ఇతర వివరములకు మీ స్థానిక డీలర్లను సంప్రదించండి లేక మాకు వ్రాయండి. * మెసర్స్ ఆర్. ఎం. ఎస్. రేడియో హౌస్, 114, రైల్వే స్టేషన్ రోడ్, తిరుత్తురైపూండి (తంజావూరు జిల్లా). * మె॥ గణేష్ ట్రేడింగ్ ఏజెన్సీస్, 64 గురుకుల్ వీధి, తిరుచెంగోడు (సేలం జిల్లా). * మె॥ గౌరి రేడియో హౌస్, 284, రామనాథ రోడ్, మధురై-9 (ఎస్. ఐ.). * మె॥ రాధా కార్పొరేషన్, నెం 5, అబిరామి అమ్మన్ కోవిల్ వీధి దిండిగల్ (మధురై జిల్లా). * మె॥ విజయరాజ్ రేడియో సర్వీస్ సెంటర్, 103/9, మెయిన్ రోడ్, రామనాథపురం * మెసర్స్ ది పీపుల్ ఏజెన్సీస్, 42-ఎ, శేరు వీధి, సేలం (సేలం జిల్లా)